సాక్షి
అనంతపురం

బుధవారం ׀ 20 ׀ డిసెంబర్ ׀ 2023



నేటి విద్యార్థులే భావి శాస్త్రవేత్తలు
అనంతపురంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. 8లో



టమాట కిలో రూ.15
కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం అమ్మకాలు సాగాయి.

గరిష్టం/కనిష్టం 31.4°/ 18.2°
జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

విద్యుత్‌ను ఆదా చేద్దాం



ఇంధన పొదుపుపై మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర

అనంతపురం టౌన్: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి, ఆదా చేస్తేనే భావితరాలకు వెలుగునిచ్చినవారమవుతామని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ నుంచి టవర్ క్లాక్ వరకు సాగింది. జేసీ మాట్లాడుతూ విద్యుత్ పొదుపు మనందరి బాధ్యతని అన్నారు. ఒక యూనిట్ విద్యుత్ పొదుపు చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తి చేసినట్లేనన్నారు. స్టార్ రేటింగ్ ఉన్న గృహోపకరణాలు మాత్రమే వినియోగిద్దామని పిలుపునిచ్చారు. విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర మాట్లాడుతూ ఎల్ఈడీ బల్బులు తక్కువ విద్యుత్ ఖర్చుతో ఎక్కువ వెలుగు ఇస్తాయన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ జేవీ రమేష్, ఏడీలు వివేకానంద, లక్ష్మీనారాయణతో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక నగదు జమ

అనంతపురం రూరల్: సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించి అండగా నిలవాలన్న ఉద్దేశంతో 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకం' ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద అర్హులైన వారికి బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు. ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు రూ.లక్ష, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి రూ.50 వేల నగదు ప్రోత్సాహకం అందనుంది. జిల్లాలో ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన ఏడుగురు అభ్యర్థుల ఖాతాల్లోకి నేడు నగదు జమ కానుంది.

ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్‌గా మంజుల కొనసాగింపు



అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్‌గా మాల్యవంతం మంజులను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టీసీ చైర్మన్‌తో పాటు జోనల్ చైర్‌పర్సన్ల పదవీ కాలం ఇటీవల ముగిసింది. 2021 సెప్టెంబర్‌లో వీరి నియామకం జరిగింది. రెండేళ్లపాటు ఆర్టీసీ అభివృద్ధికి వీరు కృషి చేశారు. అయితే ఆర్టీసీ చైర్మన్‌గా మల్లికార్జునరెడ్డితో పాటు జోనల్ చైర్‌పర్సన్‌లను కొనసాగించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. దీంతో వైఎస్సార్‌కడప, అనంతపురం జోనల్ చైర్‌పర్సన్‌గా మంజుల కొనసాగనున్నారు. ముఖ్యమంత్రి నిర్ణయంపై జోనల్ చైర్‌పర్సన్ మంజుల, ఆమె భర్త, వైఎస్సార్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెన్నోబిలేసు హర్షం వ్యక్తం చేశారు.

నీ(టి)చ రాజకీయం

ప్రతిపక్ష ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ జల రాజకీయాలకు తెరలేపారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ జీబీసీ రైతుల గురించి మాట్లాడని ఈయన ఎన్నికలు సమీపిస్తున్న వేళ హఠాత్తుగా వారిపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారు. ఒక పక్క హంద్రీ–నీవా ద్వారా జీబీసీకి సాగునీరు విడుదల చేయాలని తన పార్టీ నాయకులతో ధర్నా చేపడుతూనే.. మరో పక్క నీరు విడుదల చేయనీయకుండా తన మద్దతుదారులు, బడా రైతులను ఉసిగొల్పి రాజకీయ కుటిలత్వం చాటారు.

- టీడీపీ నేతల ద్వారా నీటి విడుదల అడ్డగింత
- ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తీరును అసహ్యించుకుంటున్న రైతులు
- పంటలు కాపాడేందుకు మాజీ ఎమ్మెల్యే విశ్వ ప్రయత్నం



నింబగల్లు వద్ద నీరు విడుదల చేయనీయకుండా వైఎస్సార్‌సీపీ నేతలను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు


ఉరవకొండ: ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తుంగభద్ర, కృష్ణా నదులకు ఆశించిన రీతిలో వరద నీరు రాలేదు. దీంతో తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండలేదు. ఈ క్రమంలో ఆరుతడి పంటలు పెట్టుకోవాలని రైతులకు ప్రభుత్వం సూచించింది. వర్షాలు చివరలో అయినా రాకపోతాయా అన్న ఆశతో అన్నదాతలు తరి పంటలు సాగు చేశారు. వర్షాభావం వల్ల తుంగభద్ర డ్యాం అడుగంటిపోవడంతో హెచ్చెల్సీకి రావాల్సిన నీరు కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే తుంగభద్ర బోర్డు అధికారులతో మాట్లాడి జిల్లాకు ఒక టీఎంసీ నీటిని అదనంగా తీసుకొచ్చింది. అలాగే జీబీసీ (గుంతకల్లు బ్రాంచ్ కెనాల్) కింద పంటలు సాగు చేసిన రైతులు నష్టపోకుండా ఉండటానికి ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పలుమార్లు జలవనరుల శాఖ మంత్రి, చీఫ్ ఇంజినీర్లను కలిసి హంద్రీ–నీవా ద్వారా వస్తున్న కృష్ణా జలాలను జీబీసీకి మళ్లించాలని విన్నవించారు. జీబీసీకి నీరు మళ్లించడం కోసం లింకు కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైతం కోరారు. ఈ క్రమంలో రూ.40 లక్షలు మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. హంద్రీ–నీవా ద్వారా జీబీసీకి నీటిని మళ్లించడానికి ఇంద్రావతి వద్ద ఉన్న తూము నుంచి నింబగల్లు వరకు కాలువలో కంపచెట్లు పెరిగిపోవడంతో వాటిని తొలగించే పనులను విడపనకల్లు ఎంపీపీ తదితరుల పర్యవేక్షణలో ప్రారంభించారు. అలాగే విశ్వేశ్వరరెడ్డి రైతులతో కలిసి కాలువపై పర్యటిస్తూ నీటి సరఫరాకు ఉన్న అడ్డంకులను పరిశీలించారు. పంటలను కాపాడేందుకు విశ్వేశ్వర రెడ్డి కృషి చేస్తుంటే... ఎమ్మెల్యే కేశవ్ మాత్రం రైతులకు మేలు జరగకుండా 'సైంధవుడి'లా అడ్డు తగులుతున్నారు.

నీచ రాజకీయాలకు పరాకాష్ట

ఎన్నికల్లో గెలిచిన తర్వాత నుంచి నాలుగున్నరేళ్లు నియోజకవర్గం వైపు తిరిగి చూడని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్.. ఎన్నికలు సమీపించే సరికి ప్రత్యక్షమయ్యారు. జీబీసీకి సాగునీరు విడుదల చేయాలని మంగళవారం టీడీపీ, జనసేన, సీపీఐ నాయకులతో కలిసి ఉరవకొండ మండలం చిన్నముస్టూరు వద్ద హంద్రీ–నీవా కాలువ వద్ద ధర్నా చేపట్టి మీడియాకు ఫోజులిచ్చారు. రైతులపై తనకు ఎంత ప్రేమో అన్నట్టు కలరింగ్ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయనలోని నీచరాజకీయ కోణం బయట పెట్టుకున్నారు. నింబగల్లు వద్ద జీబీసీకి నీరు విడుదల చేయకుండా టీడీపీ నాయకులు, సర్పంచులు, అనుచరులను షట్టర్ల వద్ద కాపలా పెట్టించారు. ఇక్కడి నుంచి జీబీసీకి నీరు విడుదల చేస్తే నింబగల్లు సమీప ప్రాంతాల పంటలకు నీరందకుండా పోతుందంటూ రైతులను ఉసిగొలిపారు. నీరు విడుదల చేసేందుకు అధికారులతో వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులను వారి ద్వారా అడ్డుకున్నారు. ఇదంతా గమనిస్తున్న రైతులు ఎమ్మెల్యే కేశవ్ నీచ రాజకీయాలను అసహ్యించుకుంటున్నారు.

కేశవ్.. డబుల్ గేమ్ వద్దు

- రాజకీయాలు చేయకపోతే గంటలో నీటి విడుదలకు చర్యలు
- వర్షాభావంతో తగ్గిపోయిన నీటి కేటాయింపులు
- నీటి లెక్కలపై అవగాహన లేకుండా మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు తగవు
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ డబుల్ గేమ్ రాజకీయాలు ఆడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. నీచ రాజకీయం ఆపితే గంటలోనే అధికారుల ద్వారా జీబీసీ రైతులకు నీళ్లిప్పిస్తామని స్పష్టం చేశారు. జీబీసీకి నీరు విడుదల చేయాలని కేశవ్ చేసిన హడావుడి ఆందోళన, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై చేసిన విమర్శలను ఆయన ఖండించారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) కింద 30 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలకు నీరందక రైతులు పడుతున్న ఇబ్బందులను తాము గమనించామన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, హంద్రీ–నీవా అధికారులను కలిసి ఆటంకాలను అధిగమించి పంటలను కాపాడాలని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సరిగ్గా జీబీసీకి హంద్రీ–నీవా నుంచి నీరిచ్చే సమయంలో పయ్యావుల కేశవ్ సర్పంచ్, టీడీపీ నాయకులను రెచ్చగొట్టి అడ్డుకున్నాడన్నారు. గ్రామాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా తాము సంయమనం పాటించామన్నారు. జీబీసీ ఆయకట్టుకు నీరివ్వాలంటూ చిన్నముస్టూరు వద్ద కేశవ్ రోడ్డుపై బైఠాయించి షో చేయడాన్ని తప్పుబట్టారు. అక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరంలోనే టీడీపీకి చెందిన సర్పంచ్ సీతారాం ఆధ్వర్యంలో నీరు వదలకుండా అడ్డుకున్నారన్నారు. నాలుగున్నరేళ్లు నియోజకవర్గంలోనే కనిపించని ఎమ్మెల్యే.. ఏనాడూ జీబీసీ ఆయకట్టు రైతులకు నీరివ్వాలని ప్రభుత్వాన్ని కోరలేదన్నారు. పట్టుమని పది రోజులు గట్టిగా ప్రయత్నించినా సాగునీరందేదని, కోట్ల రూపాయలు విలువచేసే పంటలు కాపాడగలిగేవారని అన్నారు. అయితే కేశవ్ నింబగల్లు, వ్యాసాపురం రైతులను రెచ్చగొట్టి నీరు విడుదల కాకుండా షట్టర్ల వద్ద అడ్డుకునే ప్రయత్నం చేశారని, ఇంతకన్నా నీచ రాజకీయం మరొకటి లేదని మండిపడ్డారు.

మంత్రిపై విమర్శలు తగదు

జీబీసీ రైతులకు నీరివ్వకుండా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరుకు నీటిని తీసుకెళ్తున్నారంటూ ఎమ్మెల్యే కేశవ్ విమర్శలు చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే విశ్వ అన్నారు. హంద్రీ–నీవా ద్వారా సరాసరిన రావాల్సిన నీరు 40 టీఎంసీలు కాగా.. ఈసారి వర్షాభావ పరిస్థితుల వల్ల 17 టీఎంసీలు వచ్చాయన్నారు. అందులో జిల్లాల వారీగా కర్నూలు 2.5 టీఎంసీలు, అనంతపురం 10.417 టీఎంసీలు, వైఎస్సార్ 0, చిత్తూరు జిల్లాకు 0.5 టీఎంసీల నీరు వాడుకున్నారన్నారు. అయితే కేశవ్‌కు ఈ లెక్కలపై అవగాహన లేక మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎక్కువగా నీరు తీసుకెళ్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జీబీసీ కింద ఆయకట్టు రైతులకు నీరివ్వడానికి తాము ప్రయత్నం చేస్తుంటే కేశవ్ రాజకీయ లబ్ధి కోసం పాటుపడుతున్నాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు నియోజకవర్గ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రతిభ ఉంటే విదేశీ విద్య

- విద్యార్థులకు వరం 'జగనన్న విదేశీ విద్యా దీవెన'
- నేడు విదేశీ విద్యా దీవెన నగదు జమ

అనంతపురం రూరల్: పేదరికం వల్ల ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. ప్రతిభ ఉండి ఉన్నత విద్య చదవాలనుకున్న వారి కలను 'జగనన్న విదేశీ విద్యా దీవెన' ద్వారా సాకారం చేస్తున్నారు. ఈ పథకం కింద టాప్ 100 ర్యాంకులు కలిగిన విదేశీ యూనివర్సిటీల్లో సీటు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.కోటి నుంచి రూ.1.25 కోట్ల వరకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ఈబీసీ విద్యార్థులకైతే రూ.కోటి దాకా వర్తింపజేస్తుంది. టాప్ 100 నుంచి 200లోపు ర్యాంక్ కలిగిన యూనివర్సిటీల్లో సీటు వస్తే రూ. 80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఫీజులు భరిస్తుంది. ఈ పథకం కింద అనంతపురం జిల్లాలో ఎంపికైన నలుగురు విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు బుధవారం రూ.54.40 లక్షల సొమ్ము జమ కానుంది.

ప్రభుత్వ సహకారం మరువలేనిది



మలాంటి మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు విదేశీ యూనివర్సిటీల్లో చదువుతున్నామంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే. చదువు పూర్తయ్యాక స్వదేశంలో ఉద్యోగం చేసి ప్రజలకు నావంతు సేవ చేస్తా. నా ఉన్నత విద్యకు ప్రభుత్వం అందించిన సహకారం మరువలేనిది.

– జి.సాయి తనిష్క,
మాస్టర్ ఇన్ బిజినెస్ అనలటిక్స్,
కొలంబియా యూనివర్సిటీ, న్యూయార్క్

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



విదేశాల్లో చదువుకోవాలనేది నా కల. అయితే మాకు అంత ఆర్థిక పరిస్థితి లేదు. 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకం ద్వారా నాకు యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్–లండన్‌లో చదువుకునే అవకాశం దొరికింది. అందుకు అవసరమైన ఫీజును ప్రభుత్వం చెల్లిస్తుండటంతో ఎంఏ అప్లైడిమ్యాజినేషన్ కోర్సు చేయడానికి త్వరలో వెళుతున్నా. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– సనీల్ రాజా అమీన్, అనంతపురం

జగన్ మామయ్య గిఫ్ట్

- 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు
- జిల్లాలో మొత్తం 22,640 మంది విద్యార్థులకు పంపిణీ
- సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా రేపు ట్యాబ్‌ల అందజేత



అనంతపురం ఆర్‌ఎంహెచ్ స్కూల్‌లో ట్యాబ్‌లను పరిశీలిస్తున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు సీఎం జగన్ వరుసగా రెండో ఏడాది 'గిఫ్ట్' ఇవ్వబోతున్నారు. తన పుట్టిన రోజు ఈ నెల 21న ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్ కల్గిన ట్యాబ్‌లు అందించనున్నారు. జిల్లాలో మొత్తం 22,540 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో తొలివిడతగా గురువారం ప్రతి మండలానికీ 170 చొప్పున మొత్తం 5,270 ట్యాబ్‌లు అందజేస్తారు. తక్కిన వారికి ఈ నెలాఖరుకు పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. గతేడాది 8.7 అంగులాల స్క్రీన్, 3 జీబీ ర్యామ్, 32 జీబీ రోమ్, 64 జీబీ ఎస్డీ కార్డ్ సామర్థ్యం కల్గిన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వీటిలో 8వ తరగతి పాఠ్యాంశాలను అప్‌లోడ్ చేశారు. ఈసారి ట్యాబ్‌లు మరింత సామర్థ్యం కల్గిన వాటిని పంపిణీ చేయనున్నారు. 8.7 అంగులాల స్క్రీన్, 4 జీబీ ర్యామ్, 64 జీబీ రోమ్, 256 జీబీ ఎస్డీ కార్డ్ ఉన్నాయి. వీటిలో 8వ తరగతితో పాటు 9, 10 తరగతుల బైజూస్ ఈ–కంటెంట్‌ను కూడా నిక్షిప్తం చేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేలా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)తో పనిచేసే డౌట్ క్లియరెన్స్ యాప్ 'ఈ–ట్యూబర్'ను కూడా అందుబాటులో ఉంచారు. మొత్తం మీద గతేడాదికంటే ఈసారి మరింత నాణ్యతతో కూడిన ట్యాబ్‌లు సరఫరా చేస్తున్నారు. కిందకు పడినా డ్యామేజీ కానంత నాణ్యత కల్గి ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

రెండేళ్లలో రూ. 155.24 కోట్లు ఖర్చు

జిల్లాలో గతేడాది 8వ తరగతి విద్యార్థులు, వారికి చదువు చెప్పే టీచర్లకు కలిపి మొత్తం 25,400 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్యాబ్, బైజూస్ కంటెంట్ కలిపి ఒక్కో ట్యాబ్ దాదాపు రూ.32 వేల దాకా ఖర్చవుతోంది. ఈ లెక్కన గతేడాది జిల్లాలో పంపిణీ చేసిన ట్యాబ్‌ల కోసం రూ.82.8 కోట్లు ఖర్చు చేశారు. టీచర్లకు గతేడాది సరఫరా చేసిన ట్యాబ్‌లే ఉంటున్న నేపథ్యంలో ఈసారి 8వ తరగతి విద్యార్థులకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. 22,540 ట్యాబ్‌లు అంటే రూ.72.44 కోట్లు ఖర్చు చేస్తోంది. రెండేళ్లలో ట్యాబ్‌ల కోసమే రూ.155.24 కోట్ల వ్యయం చేశారు.

మరింత నాణ్యమైన ట్యాబ్‌లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. బైజూస్ కంటెంట్ కల్గిన ట్యాబ్‌లు 8వ తరగతి విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. గతేడాదికంటే ఈసారి మరింత నాణ్యతతో కూడిన ట్యాబ్‌లు వచ్చాయి. ఈ నెల 21న ప్రతి మండలంలోనూ 170 ట్యాబ్‌లు విద్యార్థులకు అందజేస్తున్నాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. తక్కిన వారికి నెలాఖరులోగా అందజేస్తాం.

– వి.నాగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై జాయింట్ కలెక్టర్ మంగళవారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ప్రతి సచివాలయం పరిధిలో నిర్దేశించిన ప్రతి ఆటకూ కనీసం రెండు జట్లను ఏర్పాటవ్వాలన్నారు. క్రీడా పరికరాలను సక్రమంగా పంపిణీ చేసిన తరువాత రసీదు కాపీని ఎంపీడీఓ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆటల నిర్వహణకు మైదానాలను ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు స్వయంగా పరిశీలించాలన్నారు.

26న ప్రారంభం

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుందని జేసీ చెప్పారు. సంసిద్ధత కోసం 25న మండల, మునిసిపల్ స్థాయిలో సంబంధిత సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. క్రీడాకారులు, వీక్షకులను నియోజకవర్గస్థాయిలో ఎంపీడీఓ, మునిసిపల్ కమిషనర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి సమన్వయం చేసి సమీకరించాలన్నారు. సమావేశంలో డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, డీఈఓ నాగరాజు, డీఎల్‌డీఓలు ఓబుళమ్మ, శంకర్, నగర పాలక అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- అధికారులకు రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి ఆదేశం



సమీక్షలో రికార్డులు పరిశీలిస్తున్న ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటరుగా నమోదు, ఓటు తొలగింపు, చేర్పులు, మార్పుల విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అదే క్రమంలో క్లెయిమ్‌లకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని చెప్పారు. మంగళవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఓటరు నమోదు (ఫారం–6), ఓటు తొలగింపు (ఫారం–7), వివరాల మార్పులు, చేర్పులకు (ఫారం–8) అందిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి సంబంధించిన వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అందిన ప్రతి క్లెయిమ్‌నూ ఒకటికి రెండుసార్లు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తరువాతనే పరిష్కరించాలన్నారు.

సూక్ష్మస్థాయిలో పరిశీలన

జిల్లాలో క్లెయిమ్‌ల పరిష్కారం గురించి కలెక్టర్ గౌతమి అబ్జర్వర్‌కు వివరించారు. ప్రతి క్లెయిమ్‌నూ సూక్ష్మస్థాయి పరిశీలన చేసి... అన్నీ సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తరువాతే పరిష్కరిస్తున్నామన్నారు. మరణించిన ఓటర్లు ఉంటే... సంబంధిత కుటుంబ సభ్యులు సమాచారం ఇస్తే పంచనామా నిర్వహించి జాబితా నుంచి పేర్లు తొలగిస్తున్నామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీ సుస్మిత, శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, కరుణకుమారి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ, ఎన్నికల సెల్ తహసీల్దారు భాస్కర్, డీటీ కరణరాజు, ఎస్ఏ శామ్యూల్ బెంజిమన్ పాల్గొన్నారు.

అబ్జర్వర్ క్షేత్రస్థాయి పరిశీలన

క్లెయిమ్‌ల పరిష్కార ప్రక్రియను ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి నగరంలోని నవోదయ కాలనీ 257 పోలింగ్ కేంద్రం పరిధిలో పరిశీలించారు. ఓటరు నమోదు, ఓటు తొలగింపు దరఖాస్తులను పరిశీలించడంతో పాటు మరణించిన వ్యక్తి ఓటు తొలగింపుపై ఓటరు కుటుంబసభ్యులతో మాట్లాడారు. అదే విధంగా రుద్రంపేటలోని 25వ పోలింగ్ కేంద్రం పరిధిలోనూ క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా పీవీఎస్ బాబు

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా పీవీఎస్ బాబు నియమితులయ్యారు. వైఎస్సార్ జిల్లాలో పని చేస్తున్న ఈయన్ను అనంతపురం డీఆర్‌గా (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ఆ శాఖ ఐజీ రామకృష్ణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీవీఎస్ బాబు బుధవారం డీఆర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

అనంతపురం సెంట్రల్: బ్రేకులు ఫెయిలైనప్పుడు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రజారవాణా అధికారి సుమంత్.ఆర్.ఆదోని అన్నారు. ప్రమాదాల నివారణ అంశంపై ఆర్టీసీ డిపో మేనేజర్లు, గ్యారేజ్ ఇన్‌చార్జ్‌లు, మెకానిక్‌లకు మంగళవారం ఆర్‌ఎం కార్యాలయంలో వాబ్‌కో బ్రేక్స్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రేక్‌లు పనిచేసే విధానాన్ని వాబ్‌కో బ్రేక్స్ సీనియర్ సర్వీస్ ఇంజినీర్ సుమ వివరించారు. బస్సుల ఫిట్‌నెస్ సమయంలో బ్రేక్ సిస్టమ్ యూనిట్‌ను తప్పనిసరిగా మార్చాలన్నారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే భావి శాస్త్రవేత్తలు

- సృజనను వెలికి తీసిన జిల్లా స్థాయి 'విద్యా వైజ్ఞానిక ప్రదర్శన'
- 76 ప్రాజెక్టులో రాష్ట్రస్థాయికి తొమ్మిది ఎంపిక



ప్రదర్శనకు ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్న విద్యార్థులు



ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు, టీచర్లతో డీఈఓ నాగరాజు తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దాగిన సృజనను గుర్తించి వెలికి తీసినప్పుడే వారు భావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని జిల్లా విద్యాశాఖాధికారి వి.నాగరాజు అన్నారు. అనంతపురంలోని రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని డీఈఓ ప్రారంభించి, మాట్లాడారు. పిల్లల్లో మేథో సంపత్తిని గుర్తించి ప్రోత్సహించేందుకు సైన్స్‌ఫేర్ ఓ మంచి వేదికన్నారు. సృజనను వెలికి తీసేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ... పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు సైన్స్, గణిత ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి బాల మురళీకృష్ణ ప్రసంగిస్తూ... జిల్లాలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శనల్లో మొత్తం 326 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించగా. వీటిలో ఉత్తమమైన 76 ప్రాజెక్ట్‌లను జిల్లా స్థాయికి ఎంపిక చేశారన్నారు. వీటిని పరిశీలించిన అనంతరం 9 ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. న్యాయనిర్ణేతలుగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రఘురాములు, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి వ్యవహరించినట్లుగా పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను డీఈఓ ప్రదానం చేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే..

విభాగం	విద్యార్థి	గైడ్ టీచర్	పాఠశాల
వ్యక్తిగత	పి.అనసూయరెడ్డి	సి.రాజేశ్వరి	జెడ్పీహెచ్ఎస్, పుట్లూరు
	జి.రుషిత	ఆర్.గౌరిప్రభాంజలి	కేజీబీవీ, గుత్తి
	ఎం.హేమసాగర్	సి.నారాయణ	జెడ్పీహెచ్ఎస్, కసాపురం
గ్రూప్	బి.కీర్తన, బి.సుజాత	ఈ.హిమబిందు	ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఎస్, గోనబావి
	కె.ప్రవీణ్, ఎస్కే వినయ్	ఎం.ప్రసాద్	జెడ్పీహెచ్ఎస్, హనకనహాల్
	ఎస్.బెన్నీ, కె.మహేంద్రరెడ్డి	బి.శామ్యూల్‌ప్రతాప్	జెడ్పీహెచ్ఎస్, గుత్తి కోట
టీచర్	ఎం.ప్రసాద్	--	ఎస్ఏపీఎస్ జెడ్పీహెచ్ఎస్, హనకనహాల్
	ఎండీ రఫీ	--	ఎస్ఏపీఎస్ జెడ్పీహెచ్ఎస్, కరుట్లపల్లి
	వి.రాధాదేవి	--	జెడ్పీహెచ్ఎస్, చెర్లోపల్లి

క్లుప్తంగా

ఎంపీఆర్ నుంచి యువకుడి మృతదేహం వెలికితీత



ఆర్య (ఫైల్)

కూడేరు: మండల పరిధిలోని మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) బ్యాక్ వాటర్‌లో ఆదివారం గల్లంతైన యువకుడు మృతదేహమై తేలాడు. మూడు రోజులుగా కూడేరు ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది గాలింపులు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం ఉదయం నుంచి ప్రత్యేక బోట్లు వేసుకుని రిజర్వాయర్ లోతట్టు ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. సాయంత్రం 4 గంటలకు ఆర్య (22) మృతదేహం లభ్యమైంది. ఉరవకొండలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ధనుంజయ రెండో కుమారుడు ఆర్య... డిగ్రీ వరకూ చదువుకున్నాడు. తన స్నేహితులు ఆరుగురితో కలసి ఆదివారం ఎంపీఆర్ సందర్శనకు వచ్చాడు. బ్యాక్ వాటర్ ఒడ్డున ఉన్న మత్స్యకారుల తెప్పను గమనించి అందులో రిజర్వాయర్‌లోకి ప్రవేశించారు. మధ్యలోకి వెళ్లిన తర్వాత తెప్ప అదుపుతప్పడంతో ఆర్య నీటిలో పడి చూస్తుండగానే గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అప్పటి నుంచి ఎంపీఆర్‌లో ముమ్మర గాలింపు చేపట్టి మూడో రోజు ఆర్య మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. ఘటనపై కూడేరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వృత్తి నైపుణ్యతతోనే రాణింపు

- సీనియర్ సివిల్ జడ్జి దీన



మహిళా ఖైదీలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న న్యాయమూర్తి దీన

బుక్కరాయసముద్రం: వృత్తి నైపుణ్యతతోనే జీవనోపాధులు మెరుగుపడుతాయని రిమాండ్ ఖైదీలకు జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి దీన సూచించారు. మహిళా ఖైదీల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు నాబార్డ్ సౌజన్యంతో ఎంబ్రాయిడరింగ్ వర్క్‌పై జైలు సూపరింటెండెంట్ రహమాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం మంగళవారం అనంపురం జిల్లా జైల్‌లో జరిగింది. కార్యక్రమానికి నాబార్డ్ డీపీఎం అనూరాధతో కలసి ముఖ్య అతిథిగా న్యాయమూర్తి దీన హాజరై మాట్లాడారు. రిమాండ్‌లో ఉన్న మహిళా ఖైదీలు ఖాళీగా ఉండకుండా టైలరింగ్, చీరలపై ఎంబ్రాయిడరింగ్‌పై శిక్షణ ఇవ్వడాన్ని అభినందించారు. వృత్తి నైపుణ్యత పెంపొందించుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. అనంతరం 60 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలకు నాబార్డ్ ఆధ్వర్యంలో రూపొందించిన సర్టిఫికెట్లను న్యాయమూర్తి ప్రదానం చేశారు.

మానసిక సంఘర్షణతోనే ఆత్మహత్య

- ఎస్ఆర్ఐటీలో బీటెక్ విద్యార్థిని కవిత ఆత్మహత్యపై స్పందించిన పోలీసులు
- కళాశాల యాజమాన్యం, కుటుంబసభ్యుల ఒత్తిళ్లు లేవని స్పష్టీకరణ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీలు

అనంతపురం క్రైం: బుక్కరాయసముద్రం పరిధిలోని ఎస్ఆర్ఐటీలో బీటెక్ చదువుతున్న కవిత ఆత్మహత్యపై పోలీసులు స్పష్టతనిచ్చారు. కేవలం మానసిక సంఘర్షణతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని, ఇందుకు సంబంధించిన పూర్తి స్థాయి ఆధారాలు లభ్యమైనట్లు పేర్కొన్నారు. విద్యార్థినికి కళాశాల యాజమాన్యంతో పాటు కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేవని స్పష్టమైందన్నారు. వివరాలను మంగళవారం అనంతపురంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీలు ప్రసాదరెడ్డి, వెంకటశివారెడ్డి వెల్లడించారు. పుట్లూరు మండలం ఎ.కొండాపురం గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె కె.కవిత... ఎస్ఆర్ఐటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్ గదిలో సోమవారం సాయంత్రం 4.45 గంటలకు ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సాయంత్రం తోటి విద్యార్థులు హాస్టల్ గది నుంచి స్నాక్స్‌కు వెళుతూ కవితను కూడా తమతో పాటు రావాలన్నారు. అయితే తాను వెళ్లకుండా గదిలోనే ఉండిపోయింది. దీంతో స్నేహితులు వెళ్లి స్నాక్స్ తీసుకుని తిరిగి గది వద్దకు చేరుకునే సరికి తలుపులకు లోపల గడియ వేసి ఉంది. పిలిచినా ఎలాంటి స్పందనా లేకపోవడంతో విద్యార్థుల నుంచి సమాచారం అందుకున్న హాస్టల్ వార్డెన్, సిబ్బంది అక్కడకు చేరుకుని కిటికీ అద్దాన్ని పగులగొట్టి చూశారు. అప్పటికే లోపల ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతున్న కవితను గమనించి తలుపులు బద్దలు గొట్టి లోపలికెళ్లి ఆమెను కిందకు దించారు. అనంతరం ఆగమేఘాలపై అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. అయితే విద్యార్థిని ఆత్మహత్యపై విద్యార్థి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తూ చేసిన ఆరోపణలపై ఎస్పీ అన్బురాజన్ స్పందిస్తూ మరింత లోతైన విచారణ కోసం ప్రత్యేకాధికారిగా బుక్కరాయసముద్రం సీఐ జి.రామకృష్ణారెడ్డిని నియమించారు. దీంతో కవిత ఉంటున్న హాస్టల్ గదిని రామకృష్ణారెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో కవిత మంచంపై ఉన్న నోటు పుస్తకంలో తాను చివరి క్షణంలో రాసుకున్న సూసైడ్ నోట్ లభ్యమైంది. అలాగే గత నవంబర్‌లో ఆమెకు తల్లిదండ్రులు ప్రశాంతి మైండ్‌కేర్ క్లినిక్‌లో చికిత్స చేయించిన ప్రిస్క్రిప్షన్‌నూ అదే గదిలో స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ నోట్‌లో తనకు బతకాలని లేదని, చదువులో వెనుకబడి పోతున్నానని, ఎవరితోనూ సక్రమంగా మాట్లాడలేకపోతున్నానని రాసుంది. కళాశాల యాజమాన్యంపై కాని, సహచర విద్యార్థులపై గాని, అధ్యాపకులపై గాని ఎలాంటి ఆరోపణలు చేయలేదు. పోస్టుమార్టం అనంతరం మెడికల్ ఆఫీసర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని డీఎస్పీలు వెల్లడించారు.

రాయలసీమలోనే 'సూపర్'కు ప్రత్యేక స్థానం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- సీఎం వైఎస్ జగన్ చొరవతోనే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటైన అనతి కాలంలోనే కార్డియాలజీ, న్యూరో సర్జరీ విభాగాల్లో రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించి రాయలసీమలోనే ప్రత్యేక స్థానం వచ్చిన వైద్యులు, స్టాఫ్‌నర్సులు, ఇతర సిబ్బంది సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన సేవలందించాలని పిలుపునిచ్చారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇప్పటి వరకూ కెరొనరీ ఆంజియోప్లాస్టీలు 105, యాంజియోగ్రామ్‌లు 300, న్యూరో విభాగంలో 800 మేజర్, మైనర్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేయడంపై మంగళవారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ. 'అనంత' ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని తాను ఎంపీగా ఉన్న సమయంలో జిల్లాకు ఎయిమ్స్ తీసుకువచ్చేందుకు చేసిన ప్రయత్నాలను గుర్తు చేశారు. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అప్పట్లో అనంతకు మంజూరైన ఎయిమ్స్‌ను మంగళగిరికి మళ్లించి, జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కేటాయించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 2022లో సూపర్ స్పెషాలిటీలో కార్డియాలజీ, న్యూరో సేవలు మొదలయ్యాయన్నారు. ఇప్పటి వరకూ గుండె, న్యూరో సర్జరీ విభాగాల్లో మేజర్, మైనర్ సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసిన కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, తదితర సిబ్బందిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో విద్య, వైద్యాన్ని ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేరువ చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని తాజాగా రూ.25 లక్షలకు పెంచారన్నారు. రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రిని విస్తరిస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులను అధికంగా చేయడం ద్వారా ఆస్పత్రి అభివృద్ధికి నిధులు సమకూరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్డియాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్, న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ ఆయా విభాగాల్లో వారందించిన సేవలను వివరించారు. వివిధ పరికరాల ఆవశ్యకత ఉందని, వాటిని ఏర్పాటు చేస్తే రోగులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. కియా కంపెనీ సీఈఓ డాంగ్లీ మాట్లాడుతూ... కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పరికరాలను సమకూర్చినట్లు గుర్తు చేశారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కియా సీఈఓను ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్, గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని తదితరులు పాల్గొన్నారు.

జనవాక్కు

జగనన్న మేలు ఎన్నటికీ మరువం



వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్న మాకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. భార్యతో సహా అందరమూ కూలి పనులు చేస్తుంటాం. అతి కష్టంపై పిల్లలను చదివించుకుంటున్నాం. నాకు కిడ్నీలో విపరీతమైన నొప్పి ఉండడంతో పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలన్నారు. రూ.5 లక్షల ఖర్చు వస్తుందన్నారు. అంత ఖర్చు పెట్టే స్తోమత లేకపోవడంతో వెనక్కు వచ్చేశాం. కొన్నాళ్ల తర్వాత మా ఊరికి వచ్చిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వద్ద నా పరిస్థితి విన్నవించుకున్నా. స్పందించిన ఆయన వెంటనే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద అనంతపురంలోని ఓ పెద్ద ప్రైవేట్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. నాలాంటి ఎందరో అభాగ్యులను ఆదుకునేలా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మేలు ఎన్నటికీ మరువలేం.

– యల్లప్ప, బీటీప్రాజెక్ట్ గ్రామం, గుమ్మఘట్ట

నాకు మేలు జరిగింది



నేను, నా భర్త రోజువారీ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. పనులుంటేనే కుటుంబం గడుస్తుంది. లేకుంటే పస్తులే. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మాబోటి కూలి బతుకులు ఎంతో బాగుపడ్డాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నాకు మేలు జరిగింది. ఇప్పటి వరకూ మూడు దఫాలుగా వైఎస్సార్ చేయూత ద్వారా సాయమందింది. విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో నా కుమారుడు పులివెందులలో బీటెక్ చదువుతున్నాడు. నా భర్త దేవరాజు కుడి కంట్లో పొర ఏర్పడిన కారణంగా చూపు మందగించింది. దీంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించాను. ఇప్పుడు మా కుటుంబ ఆర్థిక పరిస్థితి ఎంతో మెరుగుపడింది. మా కష్టాలు తీర్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నాం.

– లలితమ్మ, శ్యామ్‌సన్‌పురం, గుంతకల్లు

అక్రమ మద్యం స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నార్పల: అక్రమంగా తరలిస్తున్న రూ.2 లక్షల విలువైన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంగళవారం ఉదయం డీఎస్పీ వెంకటశివారెడ్డి, నార్పల ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నార్పల క్రాస్‌లో ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో బత్తలపల్లి వైపు నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేయడంతో 27 కేసుల మద్యం బాటిళ్లు, 2,592 టెట్రా ప్యాకెట్లు బయటపడ్డాయి. వీటిని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. దమ్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరొకరు పరారయ్యారు. పట్టుబడిన వారిలో పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన గోవర్ధన్, యల్లనూరు మండలం చింతకాయమంద నివాసి రాజు, గొడ్డుమర్రికి చెందిన చౌదురూ ఆవుల స్వామి ఉన్నారు. పరారీలో ఉన్న యల్లనూరు మండలం కల్లూరు నివాసి మహబూబ్‌బాషా కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు పోలీసులు వివరించారు.

రేపటి నుంచి 'వందేభారత్' వేళల్లో మార్పు

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రం మీదుగా నడిచే వందేభారత్ రైళ్ల రాకపోకల్లో స్వల్ప మార్పులు చేశారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాచిగూడలో ఉదయం 5.45కు బయలుదేరి అనంతపురానికి 10.29 గంటలకు చేరుకుంటుంది. తిరిగి యశ్వంతపుర నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరిన రైలు సాయంత్రం 5.05 గంటలకు అనంతపురానికి చేరుకుంటుంది. మారిన వేళలు గురువారం నుంచి అమలులోకి రానున్నాయి.

పోక్సో కేసు నమోదు

పెద్దవడుగూరు: ప్రేమ పేరుతో ఓ విద్యార్థినిని వంచిస్తూ ఇబ్బందులకు గురిచేసిన పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడుకు చెందిన యువకుడు పుల్లయ్యపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీఐ శంకరరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. కొన్ని రోజులుగా బాలికను పుల్లయ్య వెంటబడి వేధిస్తుండడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం పక్కా ఆధారాలతో పోక్సో చట్టం కింద యువకుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ పాదచారి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం గరుడాపురానికి చెందిన జి.గంగాధర్ (54) మంగళవారం ఉదయం కళ్యాణదుర్గానికి వెళ్లే ప్రధాన రహదారిని దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. గంగాధర్‌తో పాటు ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు కర్ణాటకలోని తిప్పారెడ్డిపల్లికి చెందిన ఆదిశేషు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గంగాధర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆదిశేషు పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు 2వేల మందితో బైక్ ర్యాలీ

- అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్



అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలో ముందస్తు వేడుకలను ఘనంగా చేపడుతున్నట్లు అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం ఉదయం నగరంలో 2వేల మందితో భారీ బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. శ్రీనగర్ కాలనీలో ఉన్న తన నివాసం నుంచి రుద్రంపేట, బళ్లారి బైపాస్ ఎంజీ పెట్రోలు బంక్, నడిమివంక, టవర్‌క్లాక్ మీదుగా లలిత కళాపరిషత్ వరకూ ర్యాలీ కొనసాగుతుందన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన 60 అడుగుల ఎత్తయిన సీఎం వైఎస్ జగన్ కటౌట్‌ను 2వేల లీటర్ల పాలతో అభిషేకించి 30 అడుగుల గజమాలను వేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బంగ్లాదేశ్‌కు వెళ్లొచ్చిన క్రికెటర్లకు కిట్ల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'చలో అనంతపురం' విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: ఆంధ్రప్రదేశ్ సమాన, సమగ్రాభివృద్ధి కోసం ఈ నెల 27న అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో తలపెట్టిన మేధావుల సదస్సును జయప్రదం చేయాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సమితి సభ్యులతో కలసి అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన మేధావులు హాజరు కానున్నారన్నారు. కార్యక్రమంలో రాజా, జేఏసీ నాయకులు సాకే హరి, కేపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ కోల్డ్ స్టోరేజీల ప్రారంభం

కూడేరు: మండలంలోని ముద్దలాపురంలో ఒక్కొక్కటి రూ.12.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రెండు సోలార్ కోల్డ్ స్టోరేజ్‌లను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మంగళవారం ప్రారంభించారు. ఒక్కొక్కటి 10 టన్నుల సామర్థ్యం నిల్వ ఉండేలా నిర్మించారు. అనంతరం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీలో తయారవుతున్న స్నాక్స్, ఆహార ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించారు. ముడి సరుకులను ఎక్కడి నుంచి సేకరిస్తున్నారని ఆరా తీశారు. ప్రస్తుతం తయారైన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాన్ని అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉద్యానాధికారి హరినాథ్‌రెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనసున్న మారాజు సీఎం వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



తాడిపత్రి: నిరుపేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచుతూ తాను మనసున్న ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్ ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. మంగళవారం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజారోగ్యం మీద ప్రత్యేక దృష్టి సారించి ఆరోగ్యశ్రీ, 108, 104 వంటి సేవలను ప్రవేశపెట్టి ఉమ్మడి రాష్ట్రంలో లక్షలాది మంది ప్రాణాలను కాపాడారన్నారు. ఆయన తనయుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగడుగులు ముందుకేసి 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ, ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు గ్రామీణులకు చేరువ చేశారన్నారు. రూ.700 కోట్లతో ఉద్దానం ప్రాంతానికి వైఎస్సార్ సుజలధారను అందించిన అపర భగీరథుడిగా సీఎం వైఎస్ జగన్ ఖ్యాతి దక్కించుకున్నారన్నారు. పేదలకు అన్ని విధాలుగా అండగా నిలిచిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు.

నేత్రపర్వంగా పాతప్పస్వామి జాతర

కుందుర్పి: మండలంలోని మహంతపురంలో మంగళవారం పాతప్ప స్వామి జాతర ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత నిర్వహించిన జాతరకు భక్తులు పోటెత్తారు. గ్రామ శివారులోని ఆలయంలో స్వామి వారికి వేకువజామునే విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అనంతరం వెండి పల్లకీపై స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. సాయంత్రం వందలాది భక్తులు ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి గ్రామోత్సవం, గావుల ఉత్సవం నిర్వహించారు.



పాతప్పస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



బోనాలు మోస్తున్న భక్తులు

పార్టీలకతీతంగా ప్రతి ఇంటికీ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి హాజరైన మహిళలు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. తాము ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం లేదని, ప్రజల శ్రేయస్సే ముఖ్యమన్నారు. మంగళవారం నగరంలోని సంఘమిత్ర కాలనీలోని 74వ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి బోర్డులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏమీచేయలేదన్నారు. 14 ఏళ్ల పాటు ప్రజలను వంచించి, ఏనాడూ సంక్షేమాన్ని అందించలేదన్నారు. పేదలకు మంచి జరిగితే ప్రతిపక్ష నేత చంద్రబాబు ఓర్వలేరన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో పేద పిల్లల కోసం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే దాన్ని కూడా టీడీపీ, జనసేన నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు.

నగర రూపురేఖలు మార్చేశాం:
కోవిడ్‌తో రెండేళ్లు గడిచిపోయినా, మరోరెండేళ్లలోనే రూ.800 కోట్లతో నగర రూపురేఖలు మార్చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని ఎన్నో ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం, సీఎం ప్రత్యేక నిధులు, నగరపాలక సంస్థ సాధారణ, ఇతర నిధులతో నగరం నలుదిక్కులా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలైనా ఇంత పెద్ద స్థాయిలో సంక్షేమం, అభివృద్ధిని అందించాయో చెప్పాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉదయం వేళలోనే తలుపుతట్టి పింఛన్ అందిస్తున్నామని, వచ్చే నెల నుంచి పింఛన్ రూ.3 వేలు అందిస్తామన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల జారీ:
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అందుకు సంబంధించిన ఆరోగ్యశ్రీ నూతన కార్డులను త్వరలో ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. 70వ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, మధుసూదన్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్ వీర రామకృష్ణారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు కొండ్రెడ్డి రాధ, మునిశేఖర్, నాయకులు నిహార్ రెడ్డి, శ్రీనివాసులు, లోక్‌నాథ్ రెడ్డి, నరసింహులు, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు అనంతలో ఖవ్వాలి



ఖవ్వాలి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వసీం, నదీం తదితరులు

అనంతపురం కల్చరల్: అనంతలో పెద్ద ఎత్తున ఉర్దూ గజల్ ఖవ్వాలి నిర్వహిస్తున్నట్లు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఈద్గా మసీదులో ఖవ్వాలి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆత్మీయ అతిథులుగా హాజరైన రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, మేయర్ వసీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, జిల్లా వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ తదితరులు మాట్లాడారు. ఈనెల 20న జిల్లా పరిషత్ కార్యాలయానికి సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాత్రి 7 గంటలకు ఖవ్వాలి గజల్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి ఖవ్వాల్ జనాబ్ హంసర్ హయాత్, మజహర్ హయత్, డిల్లీ నుండి రేడియో టీవీ సింగర్స్ నిజామీ సోదర బృందం, మహారాష్ట్ర నుంచి ఫైసల్ ఖాద్రి ఖవ్వాల్ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాబా ఫక్రుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్షావలి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ చేసుకుంటేనే పరిహారం



గంగలకుంటలో ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

రాప్తాడు: రబీలో రైతులు సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని అనంతపురం ఏడీఏ రవి సూచించారు. మంగళవారం గంగలకుంటలో రబీలో సాగు చేసిన వేరుశనగ పంటను వీఏఏ శ్రీనివాసులు ఈ క్రాప్ బుకింగ్ చేశారు. ఈ క్రాఫ్ బుకింగ్ ప్రక్రియను ఏడీఏ రవి, ఏఓ శేఖర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి రైతూ రబీలో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేసుకుంటేనే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వాతావరణ బీమా అందుతాయన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు రాప్తాడు విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులతో పీడీలు రాజశేఖర్ రెడ్డి, కేశవమూర్తి

రాప్తాడు: జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు పీడీలు బి.రాజశేఖర్ రెడ్డి, ఎస్.కేశవమూర్తి తెలిపారు. ఈనెల 10న అనంతపురం జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి జూనియర్ త్రోబాల్ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈపోటీల్లో జ్యోతి స్వరూప్, నరసింహ, అంజలి ప్రియ, భవిత, ఇందు ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 20 నుంచి 22 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నరసింహులు, పీడీలు, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్‌ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. డిపో అధ్యక్షుడు వెంకటేశులు, సెక్రటరీ సోమశేఖర్, నాయకులు మాధవయ్య, రంగస్వామి, సుదర్‌రాజు తదితరులు మంగళవారం అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సెక్రటరీ సోమశేఖర్ మాట్లాడుతూ రెండేళ్ల నుంచి డ్రైవర్లు, కండక్టర్ల చార్టు వేయడం లేదని, ప్రతి మూడు నెలలకు తప్పనిసరిగా వేయాలని డిమాండ్ చేశారు. బళ్లారి, నార్పల రూట్‌లకు సర్వే చేసి, ఓటీలు ఫిక్స్ చేయాలన్నారు. బస్సుల మెయింటెన్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. గ్యారేజీ సిబ్బందిని దుర్భాషలాడుతున్న ఎస్‌డీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిపోలోని సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

జగనన్నకు అండగా ఉందాం



తాటిచెర్లలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి జగనన్నకు అండగా ఉందామని ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం తాటిచెర్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన రూ. 16.65 కోట్లకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్ రవీంద్రరెడ్డి, గ్రామ కమిటీ చైర్మన్ ఇరగం నాగేశ్వరరెడ్డి, చిన్నపెద్దన్న, స్టోర్ డీలర్ ప్రకాష్‌రెడ్డి, రామచంద్రయ్య, గొల్ల సన్నప్పయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి..
పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వైఎస్సార్‌సీపీని మరోమారు ఆశీర్వదించాలని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలను కోరారు. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో లబ్ధి పొందిన రూ.29,40,38,410కు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, పార్టీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీ కృష్ణారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రిశ్రీనివాసులు, ఉప సర్పంచ్ భాస్కర్, నాయకులు నల్లపరెడ్డి, ఆనందప్ప, నరసింహులు, రాజారెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, సాలా శీనా,ఉప్పర గోవింద్, ఉప్పర ముత్యాలు, అంజి, కక్కలపల్లి, ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి సర్పంచులు గార్లదిన్నె కృష్ణయ్య, గురుప్రసాద్, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సునీల్‌దత్త రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికితీయాలి

• జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



చెక్కు అందిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో అద్భుత నైపుణ్యాలు ఉంటాయని, వాటిని వెలికి తీసేందుకు ఆర్థిక చేయూతనందించేందుకు స్కోర్ స్కాలర్‌షిప్ పరీక్షలాంటివి ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. శ్రీ చైతన్య పాఠశాలల యాజమాన్యం నిర్వహించిన స్కోర్ స్కాలర్‌షిప్ పరీక్ష- 2023 ఫలితాల్లో ప్రతిభ చాటిన చైతన్య పాఠశాలల విద్యార్థులకు ఎస్పీ అన్బురాజన్ చేతుల మీదుగా మంగళవారం రివార్డు అందించారు. చైతన్య పాఠశాలల యాజమాన్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎస్పీని కలిశారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లా నుంచి 13 మంది విద్యార్థులు, స్కాలర్‌షిప్ రివార్డ్స్ సాధించారన్నారు. రూ. 1.19 లక్షల విలువైన చెక్కును ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు కె.విశ్వనాథ్, సమీనాఖాన్, ఖలందర్, తబస్సుమ్, శ్రీదేవి, నారాయణస్వామి, బాబు, ఫిలిప్, నవీన్, కోఆర్డినేటర్స్ రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణం, డీన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న డీడీ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగితేనే చదువులో రాణిస్తారని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి సూచించారు. మంగళవారం తాడిపత్రిలోని సిద్దార్థ బీఈడీ కళాశాలలో తాడిపత్రి డివిజన్ పరిధిలోని బీసీ వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై గౌరవం పెంచుకోవాలన్నారు. ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలన్నారు. పదోతరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులకు వసతి గృహాల్లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారి రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్టు రైల్వేస్టేషన్‌కు తాగునీటి సౌకర్యం



రైల్వేస్టేషన్‌కు పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఫోర్టు రైల్వే స్టేషన్‌కు మంగళవారం ఐఓడబ్ల్యూ అధికారి నాగేశ్వర నాయక్ తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయించారు. సత్యసాయి వాటర్ మేనేజ్‌మెంట్ తో మాట్లాడి ఫోర్టు రైల్వే స్టేషన్‌కు తాగునీటి సదుపాయాన్ని కల్పించారు. రైల్వే ప్రయాణికులు ఐఓడబ్ల్యూ అధికారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమాండెంట్ గంగాధర్ రావు

బుక్కరాయసముద్రం: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు పేర్కొన్నారు. మంగళవారం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఉద్యోగులు మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా, వ్యాయామం క్రమ తప్పకుండా చేయాలన్నారు. పోలీసులు శారీరకంగా దృఢంగా ఉండేందుకు స్పోర్ట్స్‌మీట్ ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు. బెటాలియన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అందుకు పోలీసు సిబ్బంది సహకరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎస్కేయూ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు, డీఎస్పీలు రమణమూర్తి, దామోదర్, కేఎంపీ ప్రాజెక్ట్ మేనేజర్ ధనుంజయరావు, సెంట్రల్ యూనివర్సిటీ సీపీడబ్ల్యూడీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాము, నాగేంద్ర, లోకేశ్వర నాయుడు, రామారావు, కృష్ణా నాయక్, బెటాలియన్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురి డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడిన ఏడుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. అనంతపురంలో ముగ్గురు, కళ్యాణదుర్గంలో ముగ్గురు, గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గంలో ఒక్కొక్కరు చొప్పున డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

నేడు మహాపడి పూజలు

అనంతపురం కల్చరల్: నగరంలోని హరిహర దేవాలయంలో బుధవారం మహాపడి పూజ జరుగుతుందని నిర్వాహకులు ఆకుల రాఘవేంద్ర, రాజారమేష్, మణికంఠ మంగళవారం తెలిపారు. శబరిమల సన్నిధానం నుంచి మున్‌మేల్ బ్రహ్మశ్రీ దామోదరన్ పొట్టిస్వామి అనంతకు విశిష్ట అతిథిగా వస్తారని, 36 కలశాలు, వేర్వేరు ప్రాంతాల నుంచి తెప్పించే పుష్పాలతో మహాపడి పూజ ఉంటుందన్నారు.

రాప్తాడు విజయం



సమీన

అనంతపురం: ఏపీఎల్ అండర్-16 గరల్స్ క్రికెట్ లీగ్‌లో భాగంగా రాప్తాడు, ఆత్మకూరు జట్ల మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్‌లో రాప్తాడు విజయం సాధించింది. ఆత్మకూరు జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 9.2 ఓవర్లలో కేవలం 15 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన రాప్తాడు జట్టు కేవలం రెండు ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి, పది వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాప్తాడు జట్టు తరఫున సమీన 5 వికెట్లు తీసి, స్వల్ప స్కోరుకే ఆత్మకూరును కట్టడి చేసింది.

సెల్‌ఫోన్ మరమ్మతుపై శిక్షణ

కళ్యాణదుర్గం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో సెల్‌ఫోన్ రిపేరీ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుపై నైపుణ్య శిక్షణ కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెల్‌ఫోన్ రిపేరీతో పాటు కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి, ఇంగ్లిష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఉంటుందన్నారు. 45 రోజుల పాటు కోర్సు వ్యవధి ఉంటుందని, 18-40 మధ్య వయస్సు ఉండి, ఏడో తరగతి నుంచి ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. అభ్యర్థులకు శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు టూల్ కిట్ అందజేస్తామన్నారు. వివరాలకు కళ్యాణదుర్గంలోని పాత ఆర్టీటీ కార్యాలయంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ లేదా 9440433919, 9959422884, 7780752418 నంబర్లను సంప్రదించాలన్నారు.

పథకాలను పాటలరూపంలో వివరిస్తాం



మాట్లాడుతున్న సాంస్కృతిక విభాగం జోనల్ చైర్మన్ రిలాక్స్ నాగరాజు, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను పాటల రూపంలో వివరిస్తామని వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ చైర్మన్ రిలాక్స్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 20న జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 16 మంది గాయకులతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు హాజరవుతారన్నారు. సమావేశంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

నేడు ఉర్దూ సంగీత కచేరీ

అనంతపురం రూరల్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముషాయరా, మెహఫిల్ ఏ గజల్ ఉర్దూ సంగీత కార్యక్రమం ఉంటుందని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహమ్మద్ రఫీ తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో రాత్రి ఏడు గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సూఫ్ నిజామ్ బ్రదర్స్ హంసర్ హయత్, మజహార్ నిజామి సోదరుల బృందంతో పాటు రేడియో, టీవీ సంగర్స్ సంగీత కచేరీ ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేకు మాల్యవంతం మంజుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే అనంతకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాల్యవంతం మంజుల తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్‌గా మంజులను కొనసాగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆమె ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు పెన్నోబులేసు, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సాకే చంద్రలేఖ, మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గౌస్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

రాగిజావ.. జుర్రున తాగేద్దాం!



రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో రాగిజావ తాగుతున్న విద్యార్థులు



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద'లో భాగంగా ఉదయం పూట రాగిజావ (రాగిమాల్ట్) అందిస్తోంది. రాగిజావతో అనేక ప్రయోజనాలున్నాయి. రక్తహీనతను నివారిస్తుంది. ఎముకలను పటిష్టంగా ఉంచుతుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. అందులో భాగంగా నగరంలోని రాజేంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటల సమయంలో విద్యార్థులకు రాగిజావ అందించారు. దీంతో విద్యార్థులు రాగిజావను ఇష్టంగా తాగారు. విద్యార్థులందరూ రాగిజావను ఇష్టంగా తాగుతున్నారని ఉపాధ్యాయులు తెలియజేశారు. - సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం:

